క్లుప్తంగా

భవన నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలి



భవన సముదాయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ వెంకటప్రకాష్

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న భవన సముదాయ పనులను నాణ్యతగా చేపట్టాలని మండల పంచాయతీరాజ్ ఏఈ వెంకటప్రకాష్ సూచించారు. సోమవారం ఆయన భవన నిర్మాణ పనులను సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లు శ్రీరాములు, నాగసుప్రియలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొలతను తనిఖీ చేసి, పనులను త్వరితగతిన, నాణ్యతగా చేపట్టేలని కాంట్రాక్టర్లకు సూచించారు. నిర్మాణ పనులను రెగ్యులర్‌గా పర్యవేక్షించాలని ఇంజినీర్ అసిస్టెంట్లను ఆదేశించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని బస్‌షెల్టర్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ పాండురంగన్న సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి హాజరై ప్రజలకు నీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి, పారిశుద్ధ్య కూలీలు, గ్రామ ప్రజలు, ప్రయాణికులు పాల్గొన్నారు.

నేటి నుంచి తిమ్మందొడ్డిలో దేవర

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో మంగళవారం నుంచి గ్రామ దేవత దేవర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలోని పాత కాలనీలో కొలువైన మారెమ్మ అమ్మవారి దేవరను మంగళ, బుధవారాల్లో (రెండు రోజుల పాటు) నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. మంగళవారం అమ్మవారికి నైవేద్యాలను సమర్పించిన అనంతరం కుంభం కాగులతో బుధవారం వేకువజామున ఆలయానికి చేరుకుని, అమ్మవారికి మొక్కులు చెల్లిస్తారని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

పంటలను పరిశీలించిన జీడీపీ ఏఈ



కోడుమూరులో కొర్ర పంటను పరిశీలిస్తున్న ఏఈ నారాయణ

కోడుమూరు రూరల్ : గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద సాగవుతున్న ఆరుతడి పంటలను సోమవారం ఏఈ నారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో కాల్వ కింద సాగవుతున్న ఆరుతడి పంటలు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి, ఇంకా ఎంత కాలం నీళ్ల అవసరమవుతాయన్న విషయాలపై చర్చించారు. ఆరుతడి పంటగా సాగు చేసిన కొర్ర పంట ప్రస్తుతం కంకి దశలో ఉందని, మరో 10రోజుల పాటు నీటి తడులు అందిస్తే పంట చేతికొస్తుందని రైతులు ఏఈకి తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలకు కృషి చేస్తానని ఏఈ హామీ ఇచ్చారు.

రథోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే

కల్లూరు: శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని కొంగనపాడు, పుసులూరు గ్రామాల్లో నిర్వహించిన సీతారాముల రథోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. స్వామి,అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

చేనేతలను ఆదుకోవాలి

కోడుమూరు రూరల్ : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో అల్లాడుతున్న చేనేత కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామార్తి రాజు డిమాండ్ చేశారు. దీర్ఘకాలికంగా ఉన్న చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట చేనేత కార్మికులు ధర్నా నిర్వహించారు. రాజు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం కింద చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24వేలు ఇచ్చేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది గడుస్తున్నా చేనేత కార్మికుల కోసం ఎలాంటి పథకాలను అమలు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా ఏడాదికి రూ.36వేలను ఒక్కో చేనేత కుటుంబానికి అందజేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని చేనేత జౌళి శాఖ ఆఫీసర్ సత్యనారాయణకు అందజేశారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి గఫూర్‌మియ్యా, చేతనే కార్మికులు మునిస్వామి, బుడ్డప్ప, తాయప్ప, శివశంకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదం మాటు వేసింది

పాణ్యం మండలం పిన్నాపురం ఘాట్‌లోని మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన సైడ్‌గ్రిల్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని శిథిలావస్థకు చేరుకోగా..మరికొన్ని ఊడిపడిపోయాయి. మూడు మలుపుల వద్ద ఇదే పరిస్థితి. ఈమార్గంలో వాహనాల రాకపోకలు ఎక్కువ. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురికావాల్సిందే. పొరపాటున మలుపు వద్ద మరో వాహనం ఎదురొస్తే ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. అధికారులు స్పందించి సైడ్‌గ్రిల్స్‌ను పునరుద్ధరించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనాదారులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు. -పాణ్యం



ఊరు నీరడుగుతోంది

పాణ్యం మండల పరిధిలోని పిన్నాపురంలో తాగు నీటి ఎద్దడి తీవ్రమైంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా సోమవారం ఇళ్లకు బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అయితే, ఇళ్లలో తాగేందుకు నీళ్లు లేవు. పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా అరకొరగా నీటిని సరఫరా చేశారు. ఈ నీరు కోసం బిందెలు క్యూలో పెట్టి గంటల తరబడి ప్రజలు పడిగాపులు కాశారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. -పాణ్యం



పేద రైతులం.. పరిహారం ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వం ఏపీఐఐసీ కోసం తీసుకున్న తమ భూములకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామ రైతులు సోమవారం కర్నూలులో జాయింట్ కలెక్టర్ నవ్యను కలిసి కోరారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన పేద రైతులమని 40 ఏళ్ల నుంచి భూములను సాగుచేసుకుంటూ జీవిస్తున్నామని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం తమ భూమి తీసుకొని పరిహారం ఇవ్వలేదని వాపోయారు. ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని లేకపోతే భూములు వెనక్కి ఇవ్వాలని కోరారు. బాధిత రైతుల వెంట ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న ఉన్నారు. -ఓర్వకల్లు

వైభవంగా సవారమ్మ ప్రభోత్సవం



భక్తజనం మధ్య ప్రభోత్సవం

కోడుమూరు రూరల్ : మండలంలోని అమడగుంట్ల గ్రామంలో వెలసిన సవారమ్మ ప్రభోత్సవం సోమవారం సాయంత్రం గ్రామస్తులు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి విశేషపూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ భీమిరెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, ఎర్రగిడ్డయ్య, శ్రీరాములు, శ్రీను, మాదన్న, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

శ్రీరామనవమిని పురస్కరించుకుని అమడగుంట్లలో నిర్వహించిన ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో గ్రామానికి చెందిన పెద్దరంగస్వామి ఎద్దులు ప్రథమ స్థానం, ఇలాజ్‌బాషా ఎద్దులు రెండవ స్థానం, బాలమద్దిలేటి ఎద్దులు మూడవ స్థానంలో నిలిచాయి. వీరికి రూ.12వేలు, రూ.6వేలు, రూ.3,500 చొప్పుల దాతలు పడిగ సురే ష్, రమేష్, బోయ గోవిందు, గొల్లరాజులు నగదు అందజేశారు.

లక్ష్మీ వేంకటేశ్వర ఆలయం సందర్శన



ఆలయ నిర్మాణ విశేషాలను ఇంజినీర్లకు వివరిస్తున్న దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి

కోడుమూరు రూరల్ : కోడుమూరులో దాతల సహకారంతో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి నిర్మిస్తున్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం సూరత్‌కల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఇంజినీర్లు వాసు ముల్లేటి, రాజు సందర్శించారు. వారికి ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆలయ నిర్మాణ విశేషాలను వివరించారు. రూ.13 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణాన్ని పురాతన పద్ధతిలో సిమెంట్, ఇసుక ఉపయోగించకుండా పూర్తిగా రాతిశిలలు, రాతి దూలాలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎద్దుల సత్యారెడ్డి, దామోదర్, రామక్రిష్ణ, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానానికి స్థలం కేటాయించండి



పీజీఆర్‌ఎస్‌లో ఎంపీడీఓకు అర్జీ సమర్పిస్తున్న సి.బెళగల్ గ్రామస్తులు

సి.బెళగల్: స్థానిక మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానం కోసం స్థలంను కేటాయించాలని గ్రామస్తులు సోమవారం అధికారులకు అర్జీలను ఇచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ మండల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సి.బెళగల్ గ్రామస్తులు ఎంపీడీఓకు సమస్యను వివరించారు. క్రీడా స్థలం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని క్రీడా మైదానం కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, పీఆర్ ఏఈలు గోసేనాయక్, సుమంత్, వెంకటప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం పీజీఆర్‌ఎస్ నిర్వహించగా ఇద్దరు రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. ఏఓ మల్లేష్‌కుమార్, విద్యుత్ ఏఈ సుకుమార్, కొత్తకోట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరూ పరీక్షలు రాసేలా చూడాలి



ప్రశ్నాపత్రాలను హెచ్‌ఎంలకు అందజేస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: మండలంలో ప్రారంభమైన ఎఫ్ఏ - 4 పరీక్షలకు విద్యార్థులు అందరు హాజరై, రాసేలా హెచ్‌ఎంలు, టీచర్లు చూడాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయానికి చేరుకున్న ప్రశ్నా పత్రాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ, సోమవారం నుంచి 1 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు నిర్వహించే ఎఫ్ఏ - 4 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, విద్యార్థులతో తప్పకుండా పరీక్షలు రాయించాలని సూచించారు.

టీచర్లు సమయపాలన పాటించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ ఆదామ్‌బాషా అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఇనగండ్ల, గుండ్రేవుల, సంగాల గ్రామాల్లో పర్యటించి, పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంగాల న్యూ అండ్ ఓల్డ్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన అంశాలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

గడివేముల: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని ఏఓ హేమసుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పొదుపు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ప్రస్తుత వ్యవసాయంలో అధిక రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించడంతో ఆహారధాన్యాలు, కూరగాయలు, భూమి విషపూరితం అవుతుందన్నారు.ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపాలన్నారు. భూమిలేని నిరుపేద మహిళలు 365 రోజులు పెరటి తోటలు వేసుకోవాలన్నారు. త్వరలోనే గ్రామస్థాయిలో కార్యచరణ ప్రణాళిక తయారు చేసుకోవడానికి గ్రామ సభలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నాగరాజు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

పాణ్యం: చిత్తూరు జిల్లాకు చెందిన కబడ్డీ క్రీడాకారిణి పుష్పలత తన బంగారు గొలుసు పోయిందని సోమవారం పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రీడాకారిణి ఇటీవల ఎస్ కొట్టాల గ్రామంలో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్నారు. అయితే, తన మెడలోని బంగారు గొలుసు కనబడడం లేదని సోమవారం పుష్పలత పోలీసులను ఆశ్రయించారు.

ఆకట్టుకున్న పోటీలు



గిరకబండి లాగుతున్న ఎద్దులు

సి.బెళగల్: మండల పరిధిలోని మారందొడ్డి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా సోమవారం నిర్వహించిన వివిధ రకాల పోటీలు ఆకట్టుకున్నాయి. రెండవరోజు గ్రామంలోని కొండదరాముని ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పోటీలను ప్రారంభించారు. దాతల సహకారంతో చిన్నారులకు, మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ ఛేయిర్స్, బిందెలను నెత్తిపై ఉంచుకునే పోటీలను నిర్వహించగా.. పురుషులకు అరటిపండ్లు తినే పోటీలను నిర్వహించారు. పోటీలలో మహిళలు, చిన్నారులు, పురుషులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఉమామహేశ్వరి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మహిళా పోటీల విజేతలు..

ముగ్గుల పోటీలలో చిన్నారి మొదటి స్థానంతో రూ.1,516, సుజాత రెండవ స్థానంతో 1,016, స్వర్ణముఖి మూడవ స్థానంతో రూ.516 బహుమతులను అందుకున్నారు. అదేవిధంగా మ్యూజికల్ ఛేయిర్స్ పోటీలలో శృతి మొదటి స్థానంతో రూ.1,016, రూప రెండవ స్థానంతో రూ.516ల నగదును బహుమతులుగా అందుకున్నారు. అదేవిధంగా తలపై నీళ్ల బిందెలను ఎక్కువ సమయం నిలిపే పోటీలలో సుజాత మొదటి స్థానంతో రూ.1,000, చంద్రకళ రెండవ స్థానంతో రూ.500, దేవమ్మ మూడవ స్థానంతో రూ. 300ల నగదును గెలుచుకున్నారు.

గిరకబండ్ల విజేతలు..

ఎద్దుల గిరకబండి లాగుడు పోటీల్లో గుడికల్లు చాకలి నల్లయ్య ఎద్దులు మొదటి స్థానంలో రూ.15 వేలను, గుమ్మరాల ప్యాలకూర్తి షేక్‌హుసేన్ ఎడ్లు రెండవ స్థానంలో రూ.10 వేలను, పల్లుకూర్తి నరసింహుడు వృషభాలు మూడవ స్థానంలో రూ.5 వేలను, గుడికల్ ఆకుల మంగయ్య ఎద్దులు నాల్గవ స్థానంలో నిలచి రూ.2,500 వేల నగదు బహుమతులను గెలుచుకున్నాయి.

నేడు బండలాగుడు పోటీలు

మంగళవారం ఉదయం 8 గంటల నుంచి పాలపళ్ల సైజు ఎద్దుల బండ పోటీలు ఉంటయాని, పోటీలలో ఐదు స్థానాలలో విజేతలుగా నిలిచే ఎద్దుల యజమానులకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతులను దాతల సహకారంతో అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.600లను ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

రమణీయం.. సీతారాముల రథోత్సవం



రథంకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో సోమవారం సీతారాములు రథోత్సవం వైభవంగా జరిగింది. రథోత్సవంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొని రథానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో కలసి రథాన్ని ముందుకు లాగారు. సీతారాముల ఆశీస్సులు, దీవెనలు అందరిపై ఉండాలని ఎంపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్ : గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం 10వ తరగతి పూర్తయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమణ సోమవారం తెలియజేశారు. గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ ఇంగ్లీష్, తెలుగు మీడియం గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు.

అశోకాలో ఘనంగా టెక్నికల్ ఫెస్ట్

కల్లూరు: దుపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో టెక్నికల్ ఫెస్ట్ ఆవిష్కార్ -2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా మేధస్సు, ప్రావీణ్యతను పెంపొందించేందుకు ఈ వేడుకను నిర్వహించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. డాక్టర్ ఆర్ సీతారాం, ఐఐఐటీడీఎమ్, కర్నూలు, వివిధ కళాశాలల నుంచి ప్రొఫెసర్లు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్, సీఈఓ హరీష్ కృష్ణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



స్వాముల వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఓర్వకల్లు: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా స్థానిక బైరెడ్డి కాలనీలోని వీరాంజనేయస్వామి దేవాలయంలో స్వామి, అమ్మవార్లకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సింగిల్ విండో మాజీ చైర్మన్ గువ్వ నాగతిరుపాలు దంపతులు నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు జంధ్యాల మనోహరశర్మ ఆది దంపతులను ఆలయం నుంచి మండపంలోకి చేర్చి నూతన వస్త్రాలతో అలంకరించి పెళ్లి పీటలపై ఆశీనులు గావించారు. స్వాముల వారి తరుపున శివతుల శమ్మ, తిరుపాలు దంపతులు, అమ్మవారి తరుపున డోలు మల్లేశ్వరి, చిన్న తిరుపాలు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. అనంతరం అర్చకులు మనోహరశర్మ వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా స్వాముల వారి కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు గుర్రప్పస్వామి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు రఘు భోజన సదుపాయం కల్పించారు.

ఒండుట్ల గ్రామ పంచాయతీకి అవార్డు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఒండుట్ల సర్పంచ్ , పంచాయతీ కార్యదర్శి

గడివేముల: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ఆరోగ్య గ్రామ పంచాయతీగా ఒండుట్ల ఎంపిక కావడంతో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి సోమవారం సర్పంచ్ గంజర్ల గంగాధర్‌రెడ్డికి అవార్డు అందజేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని సుధీర్‌నంద సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వాసుదేవ గుప్తా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా 17 అంశాలలో మంచి ఫలితాలు సాధించి అవార్డులు అందుకోవాలన్నారు.

టీబీ ముక్త్ పంచాయతీగా భూపనపాడు

పాణ్యం: టీబీ ముక్త్ పంచాయతీగా భూపనపాడు ఎంపికైంది. దీంతో గ్రామసర్పంచ్ బండి జనార్దన్ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి చేతుల మీదుగా సోమవారం అవార్డు అందుకున్నారు. భూపనపాడు గ్రామంలో జీరో టీబీ కేసులు నమోదు కావడంతో అవార్డుకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలోగ్రామ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

తల్లి ఆరోగ్యమే బిడ్డకు రక్ష



కోడుమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్ : తల్లి ఆరోగ్యమే బిడ్డకు రక్ష అని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. సోమవారం కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ కడుపుతో ఉన్న సమయంలో కనీసం నాలుగు సార్లు వైద్యులతో పరీక్షలు, 3సార్లు స్కానింగ్ చేయించుకోవాలన్నారు. తద్వారా బిడ్డకు ఏవైనా అవయవలోపాలున్నాయా, బిడ్డ సరిగా ఎదుగుతుందా లేదా అన్న విషయాలు తెలుస్తాయన్నారు. తద్వారా తల్లి, బిడ్డల మరణాలను నివారించేందుకు వీలవుతుందని తెలిపారు. అనంతరం నోడలాఫీసర్ రఘు మండలంలోని కల్లపరి గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీ సర్వేను తనిఖీ చేసి వైద్య సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీమంత్ మాదన్న, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, ఉమాబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సెమినార్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా 4 యూత్ సంస్థ వ్యవస్థాపకులు హరిదాస్‌స్వామి మాట్లాడుతూ వ్యక్తి మనస్సును కంట్రోల్‌లో ఉంచుకోవాలన్నారు. ఇది ఎలా చేయాలో ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఓడీ శేషయ్య , కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు సొంత బిల్డింగ్ నిర్మించాలి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎస్‌యూఐ జిల్లా నాయకులు బత్తిన ప్రతాప్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కిత్రం పాణ్యంకు నూతనంగా డిగ్రీ కళాశాల మంజూరైందన్నారు. అయితే, కాలేజీ నిర్వహణకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదులను కేటాయించారన్నారు. ఈ గదుల్లోని పై పెచ్చులూడిపోతున్నాయని, ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయం పట్టుకుందన్నారు.